

**ఉదయం**
మోహినీ రూపుడై ఊరేగిన శ్రీనివాసుడు

గజరాజులు.. భజనలు.. కోలాటాలు.. భిన్న సంప్రదాయ నృత్యాలు.. వేద పారాయణం.. గరుడ వాహనమెక్కి ఏడు కొండలవాడు ఏతెంచాడు. మెడలో మెరిసే లక్ష్మీ కాసుల హారం.. మల్లెలు, కనకాంబరాలు, చేమంతులు, మనోరంజనాలతో అల్లిన మాల.. హృదయంపై కాంతులీనే పచ్చల హారం.. తలపై వజ్ర వైఢూర్యాలు పొదిగిన కిరీటం.. తిరువేంకట నాథుడి విభవాన్ని చూసి లక్షలాది భక్తజనం పులకించిపోయారు.

మంగళవారం రాత్రి మాడవీధుల్లో గరుడుడిపై విహరించిన స్వామి, ఉదయం మోహినీ రూపుడై దర్శనమిచ్చాడు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యం ఉన్న గరుడోత్సవం రోజున తిరుమల కొండ భక్తులతో కిటకిటలాడింది.

- తిరుమల,ఆంధ్రజ్యోతి



**రాత్రి**
గరుడ వాహనంపై తిరువేంకట నాథుడు

## ఎంత మహిమో.. నీదీ!

# గరుడోత్సవం

# లక్షల భక్త జనం













**గ**రుడ వాహన సేవ మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు మొదలై.. రాత్రి 11.57 గంటలకు ముగిసింది. గరుడుడిపై మలయప్పను దర్శించుకోవడానికి దాదాపు 20 గంటల పాటు నిరీక్షిస్తున్న భక్తజనం.. వాహన మండపం తెరతీయగానే రెండు నిమిషాలపాటు ఆపకుండా గోవిందనామస్మరణలు చేశారు. దీంతో సప్తగిరులు మార్మోగాయి. తొలి 30 నిమిషాలు అర్చకస్వాములు హారతి సమర్పించి మండపం వద్ద ఎదురుచూస్తున్న వీఐపీలకు దర్శనం, శఠారి ఇచ్చారు. వీలైనంత వరకు ప్రముఖులు వెనక్కి వచ్చేశారు. అనంతరం గరుడవాహనం మెల్లగా ముందుకు కదులుతూ సుమారు ఐదు గంటల పాటు నాలుగు మాడవీధుల్లో విహరించింది. గ్యాలరీల్లోని భక్తులందరూ మలయప్పస్వామిని సంతృప్తిగా వీక్షించేలా వాహన సేవ సాగింది. తమ వద్దకు ఉత్సవమూర్తి రాగానే భక్తులు కర్పూర హారతులతో నీరాజనాలు పలికారు. గ్యాలరీల ద్వారా రెండు లక్షల మంది, ఆలయం ముందు రీఫిలింగ్ ద్వారా 20 వేల మంది, గత రెండేళ్ల తరహాలోనే కార్నర్ పాయింట్లలో క్యూలైన్ల ద్వారా 40 వేల మంది.. మొత్తం 2.60 లక్షల మందికి గరుడసేవ దర్శనం కల్పించారు. ఇక, మాడవీధుల బయట అధిక సంఖ్యలోనే భక్తులు ఉన్నారు. ఐదేళ్ల తర్వాత గరుడ సేవకు భక్తుల రద్దీ అధికంగా ఉన్నట్లు అంచనా. ఏడుగంటల పాటు కళాకారులు ప్రదర్శనలిచ్చి స్వామిపై భక్తిని చాటుకున్నారు. గ్యాలరీల్లోని భక్తులకు టీటీడీ అన్నప్రసాదాల వితరణ చేసింది.



గరుడ వాహనాన్ని మోస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

## అదనపు క్యూలైన్ల వద్ద తొక్కిసలాట

తిరుమల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గరుడ సేవ సందర్భంగా కార్నర్ పాయింట్లలోని అదనపు క్యూలైన్లలోకి వెళ్లే క్రమంలో తొక్కిసలాటతో చిన్నారులు, వృద్ధులు అల్లాడిపోయారు. సాధారణంగా శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి దాదాపు 2 లక్షల మందిని అనుమతించి గరుడ వాహన దర్శనాన్ని కల్పిస్తారు. గత రెండేళ్లుగా అదనంగా భక్తులకు దర్శనం కల్పించేందుకు మాడవీధుల్లోని కార్నర్ పాయింట్లలో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకే గ్యాలరీలన్నీ నిడిపోవడంతో గేట్లు మూసివేశారు. దీంతో కార్నర్ పాయింట్లలోని క్యూలైన్ల ద్వారానైనా గరుడ వాహనంపై స్వామిని దర్శించుకుందామని భక్తులు భావించారు. వల్లభాచార్యమఠం, రాఘవేంద్ర మఠం ముందున్న ప్రవేశ మార్గాల వద్దకు భారీగా చేరుకున్నారు. అక్కడి ప్రవేశ మార్గాలు చాలా చిన్నవిగా ఉండటంతో ఒకరిని ఒకరు నెట్టుకుంటూ ముందుకు దూసుకొచ్చారు. పది ఇరవైమంది చొప్పున భక్తులను పోలీసులు వదులుకుంటూ వచ్చిన క్రమంలో.. ప్రవేశమార్గాల వద్ద భక్తుల మధ్య తీవ్రస్థాయిలో తోపులాటలు జరిగాయి. తీవ్ర ఒత్తిడితో చిన్నారులు విలపించారు. కొందరు మహిళలు దేవుడా.. అంటూ బిగ్గరగా అరిచారు. అదే ప్రదేశంలో కొందరు భారీ ఎత్తులో ఉన్న బారికేడ్లను దూకుతూ కనిపించారు. మరికొందరు బారికేడ్ల కింద నుంచి ప్రవేశించారు. దాదాపు గంటన్నరపాటు ఆ ప్రదేశమంతా గందరగోళ పరిస్థితి నెలకొంది. పోలీసులంతా కంచె లోపల ఉండి బయట గుంపుగా చేరిన భక్తులను అదుపు చేయలేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంత సమయానికి అదనపు ఎస్పీ వెంకట్రావు కంచె అవతలి వైపునకు చేరుకుని గుంపుగా ఉన్న భక్తులను వేరేవేరే ప్రవేశమార్గాలకు పంపడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. అంతకుముందు మ్యూజియం వద్ద పోలీసులు భక్తులపై విరుచుకుపడ్డారు. మాడవీధుల్లోకి వెళ్లేందుకు వచ్చిన భక్తులను లాగి బయటకు నెట్టేశారు. మహిళలని కూడా చూడకుండా చేతులు పట్టుకుని లాగేశారు.











## మధ్యాహ్నానికే నిండిన గ్యాలరీలు

**త**నకు ఎంతో ప్రీతిపాత్రమైన లక్ష్మీకాసుల హారం ధరించి.. ఇష్టుడైన గరుత్మంతుడిపై కొలువుదీరి.. మాడ వీధుల్లో ఊరేగే గోవిందుడిని కనులారా దర్శించకోవడానికి తరలివచ్చిన భక్తులతో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకే గ్యాలరీలు నిండిపోయాయి. సోమవారం రాత్రి 9 గంటల నుంచే భక్తులు ఆలయ మాడవీధుల్లోకి రావడం మొదలుపెట్టారు. రాత్రి 11 గంటల సమయానికి మాడవీధులు నిండుగా కనిపించాయి. తీవ్ర చలిలోనూ ఎక్కడికీ కదలకుండా గ్యాలరీల్లోనే నిద్రించారు. ఉదయం జరిగిన మోహిని అవతార వాహనసేవను తిలకించి తిరిగి అక్కడే ఉండిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండను సైతం లెక్క చేయకుండా, టీటీడీ ఇచ్చే అన్నప్రసాదాలను స్వీకరిస్తూ గడిపారు. మిగిలిన భక్తులు కూడా వివిధ మార్గాల ద్వారా గ్యాలరీల్లోకి చేరడంతో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకే పూర్తిగా నిండిపోయి కిక్కిరిసిపోయాయి. దాదాపు 2 లక్షల మంది గ్యాలరీల్లోకి చేరడంతో ఆ తర్వాత ప్రవేశమార్గాలన్నీ మూసివేశారు.

## పోగొట్టుకున్న నగదు, నగల అప్పగింత



తిరుచానూరు, అక్టోబరు 8: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి దర్శనానికి వచ్చి పోగొట్టుకున్న నగదు, నగలను భక్తురాలికి అధికారులు భద్రంగా అప్పగించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన సరస్వతి ఠాగూర్ కుటుంబం మంగళవారం ఉదయం అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వెళుతున్న సమయంలో లగేజీ కౌంటర్ వద్ద హ్యాండ్‌బ్యాగ్‌ను మరిచిపోయారు. దీనిని గుర్తించిన ఆలయ విజిలెన్స్ సిబ్బంది అనౌన్స్‌మెంట్ ద్వారా భక్తులకు సమాచారమిచ్చారు. ఈ సమాచారంతో వచ్చిన భక్తురాలిని నిర్ధారించుకుని ఏవీఐ బ్రహ్మానందరాజు, విజిలెన్స్ సిబ్బంది హ్యాండ్‌బ్యాగ్ అందజేశారు. బ్యాగులో బంగారు వాచీలు రెండు, కమ్మలు, ఉంగరాలు, రూ.16వేలు నగదు ఉంది. విజిలెన్స్ సిబ్బందిని ఏవీఎస్వో సతీష్‌కుమార్ అభినందించారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.31 కోట్లు

తిరుమల, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.31 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం ఆదాయ వివరాలను టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 81,481 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 38,762 మంది తలనీలాలు సమర్పించారు.

## అమ్మవారి సేవలో ఎంపీ హైకోర్టు న్యాయమూర్తి



తిరుచానూరు, అక్టోబరు 8: పద్మావతి అమ్మవారిని మంగళవారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి, అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. జస్టిస్ వెంకటరమణ ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనను అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

### శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆంధ్రజ్యోతి: తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ దర్శించుకున్నారు.

## మద్యం షాపులకు 57 దరఖాస్తులు



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా కమిషనర్

చంద్రగిరి, అక్టోబరు 8: చంద్రగిరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాలకు సంబంధించి 17 షాపులకు మంగళవారం సాయంత్రానికి 57 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ శాఖ ఉమ్మడి జిల్లా కమిషనర్ విజయశేఖర్ తెలిపారు. మంగళవారం సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డితో కలిసి ఆయన పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రగిరి మండలంలో 7 షాపులకు 31, పాకాల మండలంలోని 5 షాపులకు 5, చిన్నగొట్టిగల్లు మండలంలో 3 షాపులకు 10, ఎర్రావారిపాలెం మండలంలో 2 షాపులకు 11 దరఖాస్తులు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా వచ్చాయన్నారు. బుధవారం సాయంత్రం దరఖాస్తులకు ఆఖరు తేది అని తెలిపారు. సీఐ ఫణీంద్ర, ఎస్ఐలు సుధాకర్, గిరి, సిబ్బంది పాల్గొన్నారు.

## పురుషోత్తముడికి స్వర నీరాజనం

తిరుమల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో మంగళవారం టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టు నిర్వహించిన సంగీత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నాద నీరాజనం వేదికపై ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు లక్ష్మీసువర్ణ, మల్లేశ్వరరావు, చంద్రశేఖర్, అశోక్ బృందం మంగళధ్వని, హైదరాబాదుకు చెందిన శ్రీరామ సలక్షణ ఘనాపాఠి వేదం-భగవత్ విశ్వాసం అనే అంశంపై ఉపన్యసించారు. సాయంత్రం శ్రీరాం ప్రసాద్, రవికుమార్ బృందం(విజయవాడ) భక్తి సంగీత కార్యక్రమాలు అలరించాయి. ఆస్థానమండపంలో శ్రీవాణి, రవిచంద్ర, తేజోవతి బృందాలు(తిరుపతి) విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీనివాస వరదన్ వేదాంత దేశికులు-శ్రీవారు అనే అంశంపై ఉపన్యసించారు. సాయంత్రం మధుసూదన్‌రావు బృందం అన్నమయ్య సంకీర్తనలు, పూర్ణ బృందం హరికథాగానం భక్తులను ఆధ్యాత్మిక విందు పంచాయి.

## తప్పిపోయిన వారిని జియోట్యాగ్‌తో గుర్తింపు



తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తిరుమల, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): గరుడోత్సవంలో కుటుంబ సభ్యుల నుంచి తప్పిపోయిన నలుగురిని పోలీసులు తిరిగి అప్పగించారు. మంగళవారం మహబూబ్‌నగర్ నుంచి కుటుంబ సభ్యులతో వచ్చి తప్పిపోయిన చేతన్(3) అనే మూడేళ్ల బాలుడిని పోలీసులు పది నిముషాల్లో తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడికి జియో ట్యాగింగ్ ఉండటం వలనే తక్షణమే గుర్తించామని చైల్డ్ ట్యాగ్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలోని రావులపర్రుకు చెందిన విజయలక్ష్మి(46), కర్ణాటకలోని మేడారహళ్లికి చెందిన యమున(70),హైదరాబాద్‌కు చెందిన శివలీల(38) తప్పిపోయారు. వీరిని చైల్డ్ ట్యాగ్ టీం, హెల్ప్‌డెస్క్ సభ్యులు సురక్షితంగా తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈమేరకు వారు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

## కనకదుర్గమ్మకు వరసిద్ధుడి పట్టువస్త్రాలు



పట్టువస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 8: విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గ ఆలయంలో జరుగుతున్న శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా కాణిపాక వరసిద్ధుడి ఆలయం తరఫున పట్టువస్త్రాలను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్ మంగళవారం సమర్పించారు. వీరిని కనకదుర్గ ఆలయ ఈవో రామారావు ఆహ్వానించి, దర్శన ఏర్పాట్లను చేశారు. కార్యక్రమంలో విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, డీసీ రత్నంరాజు, మణినాయుడు, గిరిధరబాబు తదితరులు పాల్గొన్నారు.

# అలంకరణల్లో అనుగ్రహం







హంస వాహనంపై సరస్వతీ అలంకరణలో దర్శనమిస్తున్న ఎల్లమ్మ - కాత్యాయని అలంకరణలో ఉగ్రప్రత్యంగిరాదేవి అమ్మవారు- మహాలక్ష్మి అలంకారంలో దుర్గాదేవి

భాకరాపేట, అక్టోబరు 8: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని చిన్నగొట్టిగల్లు చెరుకు కట్టపై తిరుపతి గంగమ్మ మంగళవారం మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారి విగ్రహాన్ని రూ.500, రూ.200, రూ.100, రూ.50 కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ అలంకారంలో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు.

### మహాలక్ష్మిగా దుర్గాదేవి



కరెన్సీ నోట్ల అలంకరణలో తిరుపతి గంగమ్మ

రామచంద్రాపురం, అక్టోబరు 8: సూరావారిపల్లె సురభి గోశాల ఆవరణలో అమ్మవారు మంగళవారం మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. శ్రీ శక్తి పీఠంలోని మరకత శక్తి కాళీ అమ్మవారు త్రిపురభైరవీ దేవిగా దర్శనమిచ్చారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. కార్యక్రమంలో కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి స్వామి పాల్గొన్నారు. రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మి, భవానీ అమ్మవార్లు మహాలక్ష్మిగా భక్తులను కటాయించారు. కార్యక్రమంలో ఉభయ దాత నాగేశ్వరనాయుడు పాల్గొన్నారు.

### సరస్వతీ అలంకరణలో ఎల్లమ్మ

చంద్రగిరి, అక్టోబరు 8: మూలస్థాన ఎల్లమ్మ మంగళవారం రాత్రి సరస్వతీ అలంకరణలో హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మూల విరాట్‌కు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, ఉభయదారులు జయచంద్రారెడ్డి, శాంతమ్మ, చెంగల్రాయరెడ్డి, త్రిమూర్తిరెడ్డి, రవిచంద్రారెడ్డి ఒంటివారి వంశస్థులు, కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలో దుర్గాదేవి సహస్రనామార్చన చేశారు. తొండవాడలోని ఉగ్రప్రత్యంగిరాదేవి కాత్యాయని అలంకరణలో దర్శనమిచ్చారు.

### గరుడవాహనంపై కల్యాణ వెంకన్న

తిరుపతి రూరల్, అక్టోబరు 8: బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తుమ్మలగుంటలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులు, నైవేద్యం సమర్పించి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం 6గంటలకు ప్రారంభమైన గరుడ వాహనసేవ అర్థరాత్రి వరకు సాగింది. ఆలయ వ్యవస్థాపకులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తుమ్మలగుంటలో గరుడవాహన వేడుక

## ఎంబీయూలో ముగిసిన సాంకేతిక సమావేశం

చంద్రగిరి, అక్టోబరు 8: ఎ.రంగంపేట సమీపంలో మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ విభాగం నిర్వహించిన కమ్యూనికేషన్, కంప్యూటింగ్ టెక్నాలజీస్ ఆరవ అంతర్జాతీయ సమావేశం మంగళవారం విజయవంతంగా ముగిసింది, రెండు రోజుల పాటు జరిగిన సమావేశంలో ఈవెంట్ కమ్యూనికేషన్ సిస్టమ్స్, కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్ వంటి వివిధ అంశాలకు సంబంధించి పురోగతిపై చర్చించారు. కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌పై ఏఐ ప్రభావం గురించి ప్రధానంగా ప్రస్తావించారు. డిజిటల్ కనెక్టివిటీ, డేటా మేనేజ్‌మెంట్‌లో సంక్లిష్ట సవాళ్లను పరిష్కరించడానికి అకాడెమియా పరిశ్రమల మధ్య సహకారాన్ని నిపుణులు నొక్కి వక్కానించారు. కార్యక్రమాన్ని ఎంబీయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నాగరాజ్ రామారావ్, చీఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజీ ఆఫీసర్ .వికాస్ సింగ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఓ. సారథి ప్రారంభించారు.



ఎంబీయూలో సమావేశ సావనీర్ ఆవిష్కరణ



శ్రీవారిమెట్టు మార్గంలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

## గోవింద నామ స్మరణతో మార్మోగిన శ్రీవారిమెట్టు

చంద్రగిరి, అక్టోబరు 8: గరుడోత్సవం సందర్భంగా గోవిందనామ స్మరణతో శ్రీవారిమెట్టు మార్మోగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు కాలినడకన ఈమార్గాన తిరుమలకు వెళ్లారు. దసరా సెలవులు కావడంతో విద్యార్థులు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పలు స్వచ్ఛంద సంస్థలు అన్నప్రసాదాలు, మజ్జిగ, పంపిణీ చేశాయి. గోవింద సేవా మండలి నిత్యాన్నదానం నిర్వహించింది. భోజనంతో పాటు, తినుబండారాలు పంపిణీ చేశారు. సుమారు 13 వేల మందికిపైగా భక్తులు ఈమార్గంలో తిరుమలకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. టీటీడీ విజిలెన్స్ సెక్యూరిటీతో పాటు సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐలు అనిత, రవీంద్రనాయక్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

## నీవానదిలో ఇసుక తవ్వకాలు

**● తమిళనాడువాసి యంత్రాల సీజ్**

గంగాధరనెల్లూరు, అక్టోబరు 8 : గంగాధరనెల్లూరు మండలం కొట్రకోన పంచాయతీ గారంపల్లె సమీపంలోని నీవానది యేటి ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాను అధికారులు అడ్డుకున్నారు. తమిళనాడువానికి చెందిన రెండు ఎక్స్‌కవేటరును సీజ్ చేశారు.ఎమ్మెల్యే థామస్ పేరుచెప్పి స్థానిక టీడీపీ నేతలతో కలిసి తమిళనాడుకు చెందిన వ్యాపారి మూడురోజులుగా అక్కడి ఇసుకను అక్రమంగా తరలించినట్లు సమాచారం.పేద ప్రజలు ఇళ్ళనిర్మాణ పనులకు సమీపంలోని వాగులు, వంకల్లో కూలీలతో ఇసుకను ఉచితంగా తీసుకెళ్లడానికి ప్రభుత్వం అనుమతించింది. అయితే నీవానది యేటిలో యంత్రాలతో ఇసుకను గుట్టగా పోసుకుని ట్రాక్టర్లకు లోడ్‌చేసి తరలిస్తున్నారు. రోజుకు రెండువందల ట్రాక్టర్లకు పైగా గారంపల్లె నుండి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం.ఈ విషయం కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి మంగళవారం వెళ్లడంతో వెంటనే ఆయన అధికారులను గారంపల్లెకు వెళ్ళి పరిశీలించమన్నారు. దీంతో తహసీల్దార్ చంద్రశేఖర్, సీఐ లక్ష్మీనారాయణ, వీఆర్వో భాస్కర్ నీవా నదిలో ఇసుకతవ్వకాలకు వినియోగిస్తున్న హిటాచీ యంత్రాలను సీజ్‌చేసి , ఆ విషయాన్ని కలెక్టర్‌కు నివేదించారు.కొంతమంది కూలీలు నీవానది యేటిలో ఇసుకను యంత్రాలతో తవ్వి ట్రాక్టర్లకు లోడ్‌చేయడాన్ని గమనించి అక్కడున్న టీడీపీ నేతను నిలదీశారు.దీంతో ఆయన ఎమ్మెల్యేతో మాట్లాడి పని కల్పిస్తామంటూ కూలీలను అక్కడనుంచి పంపించేశాడు. కాగా ఇసుక తవ్వకాలకు వాడిన యంత్రాలకు జరిమానాలను తహసీల్దార్, మైన్స్ అధికారులు కలిసి నిర్ణయించనున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.



సీజ్ చేసిన ఇసుక తవ్వకాల యంత్రాలు

## నకిలీ ఆభరణాలతో రూ.కోట్ల మోసం

**● ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన నలుగురి అరెస్టు**

చెన్నై, అక్టోబరు 8: తమిళనాడు రాష్ట్రం తిరువళ్ళూరు జిల్లా తిరుత్తణి సమీపం కనకమ్మసత్రంలోని బ్యాంకులు, బంగారు దుకాణాల్లో నకిలీ నగలు కుదువ పెట్టి కోట్లాది రూపాయల మేర మోసం చేసిన కేసులో నలుగురు మహిళలు సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల కనకమ్మ సత్రంలో నకిలీ నగలను కదువపెట్టి రూ.2.15 లక్షల మోసం చేసిన కేసు వెలుగులోకి వచ్చింది. దీనిపై స్థానిక పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టగా, మరో మోసం వెలుగులోకి వచ్చింది. 40 శాతం బంగారం కలిపిన నకిలీ ఆభరణాలను బ్యాంకులు, కుదువ షాపుల్లో తాకట్టుపెట్టి కోట్లాది రూపాయల మేర మోసం చేసినట్టు గుర్తించారు. రేణిగుంటకు చెందిన హరిత, మదనపల్లెకు చెందిన రామాంజనేయులు , విజయపురానికి చెందిన లత , పుత్తూరుకు చెందిన చంద్రశేఖర్ , తిరుత్తణి, వీకేఎన్ కండ్రికకు చెందిన రేఖ, మల్లారెడ్డి కండ్రిగకు చెందిన తులసి అనే వారిని అరెస్టు చేశారు. వీరంతా కలిసి మహిళలకు నకిలీ బంగారు నగలు ఇచ్చి వాటిని బ్యాంకులు, బంగారు దుకాణాల్లో కుదువ పెట్టించి డబ్బులు తీసుకున్నట్టు వెల్లడైంది.

# అంగన్వాడీ కేంద్రాలకు మహర్దశ

**చిత్తూరు జిల్లాకు రూ.2.20 కోట్ల మంజూరు**

చిత్తూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యపు నష్టాన్ని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా సరిచేస్తూ వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు లేక గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లు లేక, తాగేందుకు నీళ్లు లేక అవస్థలు పడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టింది. కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నచోట అవసరమైన మౌలిక వసతుల్ని కల్పించనున్నారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పనకు సంబంధించిన పనులు చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి అప్పగించారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36 వేలు, తాగునీటి కోసం ఒక్కో ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు రూ.17వేల చొప్పున ఖర్చు చేయనున్నారు.

**380 కేంద్రాల్లో మరుగుదొడ్లు, 490 చోట్ల తాగునీటి సౌకర్యానికి చర్యలు**

జిల్లాలో మొత్తం 2,420 అంగన్వాడీ కేంద్రాలుండగా.. ఎన్నిచోట్ల సదుపాయాలు కల్పించాలో గుర్తించారు. 380 కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.36 వేల చొప్పున రూ.1.368 కోట్లు, 490 చోట్ల తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ.17వేల చొప్పున రూ.83.30 లక్షలు.. మొత్తంగా రూ.2.20 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. పనుల్ని త్వరలో ప్రారంభించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.





పులిచెర్ల మండలం మిట్టమీదరాచపల్లె అంగన్వాడీ కేంద్రం

### త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు



సొంత భవనాలున్న అంగన్వాడీ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు మంజూరయ్యాయి. తాగునీటి సౌకర్యంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతులిచ్చాం. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమన్వయం చేసుకుని వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తాం.

- హైమావతి, ఐసీడీఎస్ పీడీ

## డ్రిప్ కోసం రైతు సేవాకేంద్రంలో నమోదు చేసుకోండి



సి.గొల్లపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు

తిరుపతి రూరల్, అక్టోబరు 8: డ్రిప్ కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లెలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా క్షేత్రస్థాయిలో వరి నాటుతున్న పొలాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. పంటల సాగులో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు మనోహర్‌బాబు, వ్యవసాయాధికారి మమత, సహాయకులు ప్రేమలత, ఉపసర్పంచ్ చెంగారెడ్డి, గ్రామస్తులు మనోహర్‌రెడ్డి, మురళి, చెంగారెడ్డి, భానుకుమార్, మహేశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## నడిగడ్డలో చిరుత కలకలం

సదుం, అక్టోబరు 8: మండలంలోని నడిగడ్డ గ్రామ పరిసరాల్లో చిరుత పులి సంచరించినట్లు వదంతులు వ్యాపించాయి. మంగళవారం రాత్రి సుమా రు 7 గంటల ప్రాంతంలో గ్రామ సమీపంలోని నాగల చెరువు మొరవలో చిరుత సంచరించినట్లు గ్రామస్తులు గుర్తించారు.

## టెట్‌కు 398 మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 8: టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్టు (టెట్)కు మంగళవారం 398 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లాలోని ఎస్వీ సెట్, మదర్‌థెరీసా కళాశాలల్లో ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లో జరిగిన పరీక్షలకు 460 మందికిగాను 62మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 230 మందికిగాను 198 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 230 మందికిగాను 200 మంది హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

## వైసీపీ సర్పంచ్ నుంచి ప్రాణహాని

**● గుట్టమీదపల్లె రైతుల గోడు**

పుంగనూరు, అక్టోబరు 8: తమ భూములు ఆక్రమించిన వైసీపీ సర్పంచ్ నుంచి ప్రాణహాని ఉందని రైతులు మునిరత్నం, ఎం.ప్రతాప్, బి.ఎల్లమ్మ, సి.మల్లయ్య, వి.నరసింహులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం వారు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ సదుం మండలం 79ఏ చింతమాకులపల్లె పంచాయతీ గుట్టమీదపల్లెకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల వారికి చెందిన 20 ఎకరాల భూములను సర్పంచ్ ఎం.మల్లిఖార్జున ఆక్రమించాడని వాపోయారు. వైసీపీ ప్రభుత్వంలో తమ పొలాలను ఆక్రమించి, దాడులకు దిగిన విషయమై ఈఏడాది జూలైలో మదనపల్లెకు వచ్చిన రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాకు ఫిర్యాదు చేశామన్నారు.దాంతో విచారించి న్యాయం చేయాలని కలెక్టర్ నుంచి తహసీల్దార్‌కు లేఖ వచ్చిందన్నారు. దీంతో ఈనెల నాలుగోతేదీ సదుం తహసీల్దారు, ఇతర అధికారులు విచారణకు వచ్చారని వివరించారు. ఆ సమయంలో అధికారుల ముందే తమను తుపాకీతో కాల్చి చంపేస్తానంటూ సర్పంచ్ బెదిరించాడని వాపోయారు. దీనిపై పుంగనూరుకు వచ్చిన మంత్రులు అనిత, రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిలకు విన్నవించామని పేర్కొన్నారు. ఐదేళ్లుగా తమ భూములను అనుభవిస్తున్న వైసీపీ సర్పంచ్ నుంచి తమ భూములను విడిపించి తమకు ఇప్పించాలని కోరారు.

## పంటలపై ఆగని గజదాడులు

కల్లూరు, అక్టోబర్ 8 : పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు ఆగడం లేదు. 10 రోజుల క్రితం మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు కల్లూరు, పాతపేట, బోడిరెడ్డిగారిపల్లి, పాళెం, దేవళంపేట తదితర పంచాయతీల్లో పంట లను నాశనం చేస్తున్నాయి. మంగళవారం రాత్రి పాతపేట, కల్లూరు, దేవళంపేట, కమ్మపల్లి పంచాయతీల్లో ఏనుగుల గుంపు సంచరించాయి. వరి, టమోటా తదితర పంటలకు నష్టం వాటిల్లింది. పాతపేట వద్ద రైతు కె. సుబ్రమణ్యానికి చెందిన అర ఎకరా వరి పంట, మరో రైతు వై.సుబ్రమణ్యానికి చెందిన టమోటా పంటను ధ్వంసం చేశాయి. కల్లూరు సమీపంలోని ఎద్దలవారిపల్లి వద్ద ఏనుగులు సంచరించడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. దేవళంపేట పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లి సమీపంలో రెండుకరాల వరిపంట, బోరు పైపులు, గేటువాల్వ్, లక్ష్మణరెడ్డికి చెందిన వరిపంట, కమ్మపల్లిలోని విజయసారథి నాయుడికి చెందిన వ్యవసాయ పైపులను ధ్వంసం చేశాయి.

## కేజీబీవీల్లో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 8: జిల్లాలోని ఎనిమిది కేజీబీవీల్లో ఖాళీలుగా ఉన్న 15 నాన్ టీచింగ్ పోస్టులను ఔట్ సోర్సింగ్ విధానంపై భర్తీ చేయనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి 8 అసిస్టెంట్ కుక్, ఓ వాచర్ ఉమెన్, రెండు స్కావెంజర్స్, ఒక స్వీపర్, ఒక చౌకీదార్, రెండు హెడ్ కుక్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు వివరించారు. ఓసీ మహిళలకు వయోపరిమితి 42 ఏళ్లన్నారు. అలాగే మాజీ సైనిక ఉద్యోగ మహిళలకు 45 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ మహిళా అభ్యర్థులకు 47, పీహెచ్‌సీ మహిళా అభ్యర్థులైతే 52 ఏళ్ల వరకు అర్హులన్నారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 15వ తేదీలోపు సంబంధిత ఎంఈవో కార్యాలయాల్లో సమర్పించాలన్నారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న రవి నాయుడు

# క్రీడారంగంలో విప్లవాత్మక మార్పులు

### తీసుకొస్తామన్న శాప్ చైర్మన్ రవి నాయుడు

తిరుపతి (కలెక్టరేట్), అక్టోబరు 8: క్రీడారంగంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) విప్లవాత్మకమైన మా ర్పులు తీసుకువస్తుందని ఛైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌ను జిల్లా టీడీపీ అధ్యక్షులు నరసింహయాదవ్‌తో కలిసి రవి నాయుడు మంగళవారం కలిశారు.తిరుపతి, విజయవాడ, కాకినాడ, విశాఖపట్టణం ప్రాంతాల్లో క్రీడారంగాన్ని అభివృద్ధి చేయడమే శాప్ లక్ష్యమని చెప్పారు.జిల్లాలో శాప్‌కు 38 ఎకరాలు అవసరముందని, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేసేందుకు స్మార్ట్‌సిటీ నిధులను కేటాయించాలని కోరారు. 2014-19లో టీడీపీ ప్రభుత్వం తిరుపతి స్పోర్ట్స్ విలేజీకి 145 ఎకరాలు కేటాయిస్తే, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ భూమిని లేఅవుట్‌గా మార్చి అమ్మేసిందన్నారు. తిరుపతిలో స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వం క్రీడాకారులకు ఇచ్చిన భూములు నిరుపయోగంగా ఉన్నాయని, అకాడమీల ఏర్పాటుకు చర్యలు తీసుకునేలా ఆదేశించాలని రవి నాయుడు కలెక్టర్‌ను కోరారు.సానుకూలంగా స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మోడల్ సెంటర్లను తీర్చిదిద్దాలని సూచించారు. క్రీడారంగానికి సమకూర్చాల్సిన నిధుల విషయంలో పూర్తి సహకారమందిస్తామన్నారు.



## శ్రీలక్ష్మీదేవిగా కటాక్షించిన గంగమ్మ

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 8: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని శ్రీలక్ష్మీదేవి అలంకరణలో ఊంజలసేవ నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, హోమం, సహస్రనామ అర్చన నిర్వహించారు. భక్తులకు, ఉభయదారులకు అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయం ఈవో జయకుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

**కపిలతీర్థంలో...**

తిరుపతి కపిల తీర్థం ఆలయంలో ఉదయం యాగశాల పూజ, కామాక్షి, కపిలేశ్వరులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 6-7 గంటల మధ్య అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకరణలో ఊంజలసేవ నిర్వహించారు. బుధవారం కామాక్షి అమ్మవారు దుర్గాదేవి రూపంలో భక్తులను అనుగ్రహిస్తారు.

## విశాలాక్షి అవతారంలో బొంతాలమ్మ

తిరుపతి (జీవకోన): తిరుపతి కరకంబాడి రోడ్డులోని బొంతాలమ్మ ఆలయంలో అమ్మవారు విశాలాక్షిగా భక్తులకు దర్శనమిచ్చారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



## మహాదుర్గగా అన్నపూర్ణదేవి

**తిరుపతి అర్బన్:** స్థానిక లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో అమ్మవారు మహాదుర్గ అలంకరణలో భక్తులను కటాక్షించారు. ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నివేదన సమర్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



## లక్ష్మీదేవి అలంకరణలో మూలస్థాన ఎల్లమ్మ



లక్ష్మీదేవిగా మూలస్థాన ఎల్లమ్మ

తిరుపతి రూరల్, అక్టోబరు 8: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట చెంచువారికాలనీలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు లక్ష్మీదేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకారం, కుంకుమార్చన, హోమాలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్తలు బిరుదాల కృష్ణారెడ్డి, బిరుదాల హనుమంతరెడ్డి, సిద్దారెడ్డి, తులసీరామిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు. ● తుమ్మలగుంట ఎల్ ఎస్‌నగర్‌లోని శక్తి చాముండేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కరరెడ్డి, ఉభయదారులు లోకేశ్వర్‌రెడ్డి, హేమగిరి, పాపమ్మ, నందకుమార్, చెంగల్‌రెడ్డి, అప్పిరెడ్డి పాల్గొన్నారు.



దుర్గాదేవిగా చాముండేశ్వరీదేవి

## అంతరిక్ష వారోత్సవ పోటీల్లో భవేష్ చౌదరికి ప్రథమస్థానం



సర్టిఫికెట్ అందుకుంటున్న భవేష్‌చౌదరి

తిరుపతి(గాంధీరోడ్డు), అక్టోబరు 8: అంతరిక్ష వారోత్సవాలను పురస్కరించుకుని పద్మావతి మహిళా వర్సిటీలో ఇస్రో-షార్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో స్థానిక పీకే లేఅవుట్‌కి చెందిన మాలేపాటి ప్రతాప్‌నాయుడు, చంద్రకళ దంపతుల కుమారుడు ఎం.భవేష్‌చౌదరి అత్యుత్తమ ప్రతిభని చాటారు. ఎంఎల్‌క్యూ రాత పరీక్షల్లో ఈ విద్యార్థి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుని సర్టిఫికెట్ అందుకున్నారు. ఎడిఫైస్కూల్‌లో ఏడవతరగతి చదువుతున్న ఈ విద్యార్థిని పలువురు అభినందించారు.

## 227 మద్యం దుకాణాలకు 1520 దరఖాస్తులు

### నేటితో ముగియనున్న గడువు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 8: జిల్లాలో 227 మద్యం దుకాణాలకు అనుకున్న స్థాయిలో టెండర్లు దాఖలు కావడంలేదు. ఎనిమిది రోజుల వ్యవధిలో 1520 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఒక్కో దుకాణానికి 15 నుంచి 20 దరఖాస్తులు వస్తాయని అధికారులు భావించారు. కానీ ఇప్పటికి వచ్చింది సగటున ఆరు నుంచి ఏడు దరఖాస్తులు మాత్రమే. ఇక, బుధవారం సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే గడువు ఉంది. ఈ ఒక్క రోజు ఎన్ని దరఖాస్తులు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది.

## తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవో బాధ్యతల స్వీకరణ



రామ్మోహన్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 8: తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా బి.రామ్మోహన్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ నియమించారు. ప్రస్తుతం ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను అదనంగా తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా నియమించారు. ఇక్కడ ఆర్డీవోగా పనిచేస్తున్న నిశాంత్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణల ఆధారంగా ప్రభుత్వం సస్పెండ్ చేసింది. తరువాత శ్రీకాళహస్తి ఆర్డీవోగా ఉన్న రవిశంకర్‌రెడ్డికి తిరుపతి ఆర్డీవోగా అదనంగా బాధ్యతలు అప్పగించారు. ఆయన కూడా బదిలీ కావడంతో రామ్మోహన్‌ను ఇన్‌చార్జి ఆర్డీవోగా నియమించారు. మంగళవారం ఇన్‌చార్జి ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్‌ను పలువురు తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు అభినందించారు.

## కర్తవ్యబోధ గీత పుస్తకావిష్కరణ



కర్తవ్యబోధ గీత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 8: ఆదర్శవంతమైన జీవితం గడపడానికి కావలసినంత జ్ఞానం భగవద్గీతలో ఉందని హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ పగడాల నారాయణ అన్నారు. మంగళవారం విశ్రాంత ఉపకులపతి ఆచార్య కూతాటి వెంకటరెడ్డి రచించిన కర్తవ్యబోధ గీత పుస్తకావిష్కరణ ఆయన స్వగృహంలో జరిగింది. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ... యువతరం ఆధునిక జ్ఞానంతోపాటు ఆధ్యాత్మిక జ్ఞానాన్నికూడా పెంపొందించుకోవాలని సూచించారు. పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ చిత్రపు స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ మానవ జన్మను సార్థకం చేసుకోవడానికి గీత బోధనలు ఉపకరిస్తాయన్నారు. విశ్రాంత ఆచార్యులు కోరా వెంకటా చలపతి మాట్లాడుతూ వెంకటరెడ్డి నిరంతర విద్యార్థి అనీ, 1991లో పదవీ విరమణ చేసిన అనంతరం ఇప్పటి వరకు 29 పుస్తకాలు రచించారని, అందుకే విద్యావిదురుడు అని పేరు పొందారని తెలిపారు. రచయిత వెంకటరెడ్డి స్పందన తెలుపుతూ... తన 94వ పుట్టిన రోజు సందర్భంగా ప్రతివ్యక్తీ తన కర్తవ్యాన్ని నెరవేర్చడమే మానవ కల్యాణం అని చెప్పడానికి ఈ పుస్తకం రచించానన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు, ప్రసారభారతి విశ్రాంత అధికారి కె.విజయ, రైజ్ డైరెక్టర్ రామకృష్ణ, ఎస్వీ ఆర్ట్సు కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ అప్పాస్వామి పిళ్లై, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం



తిరుపతి(వైద్యం), అక్టోబరు 8: లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆ పార్టీ సీనియర్ నేత యార్లపల్లి గోపీ గౌడ్ పేర్కొన్నారు. తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద మంగళవారం కాంగ్రెస్ నేతలు జమ్మూ కశ్మీర్ ఎన్నికల ఫలితాల ముందస్తు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. టపాసులు కాల్చి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు రవి, తేజోవతి, శోభ, హమీజ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## హర్యానాలో బీజేపీ గెలుపుపై సంబరాలు



టపాసులు కాలుస్తూ సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ శ్రేణులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), అక్టోబరు 8: హర్యానాలో బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధించినందుకుగాను తిరుపతిలోని బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. మంగళవారం సాయంత్రం స్థానిక గోవిందరాజస్వామి ఆలయం దక్షిణ మాడవీధిలో టపాసులు కాలుస్తూ... మిఠాయిలు తినిపించుకుంటూ ఆనందం పంచుకున్నారు. బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్, కట్టమంచి చంద్రబాబుయాదవ్, తొండమనాటి సుబ్రహ్మణ్యం, జయంత్‌కుమార్, ఫణిభూషణ్‌రెడ్డి,రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్ తదితరులు సంబరాల్లో పాల్గొన్నారు.

## 14 నుంచి పల్లెపండుగను ఘనంగా నిర్వహించండి

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 8: పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో ఘనంగా నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి ఆయన జిల్లా అధికారులతో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ వర్చువల్ విధానంలో మాట్లాడుతూ జిల్లాలో జరిగే పల్లె పండుగ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, సర్పంచులు ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వాములుగా చేయాలన్నారు. ఆగస్టు నెలలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలను నిర్వహించి, ప్రతి పనికి అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. వాటిని అధికారులు ప్రారంభించాలన్నారు. వచ్చే సంక్రాంతిలోగా అన్ని అభివృద్ధి పనులు పూర్తికావాలని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. పలు పంచాయతీల్లో అభివృద్ధి పనులకు రూ.74కోట్లు మంజూరు చేశారని, ఇంకా రూ.25కోట్లు మంజూరు చేయాలని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

## వెన్నెముకలో కణితి తొలగింపు



సర్జరీ తరువాత పూర్తిగా కోలుకున్న యువతితో వైద్య బృందం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 8: రెండు కాళ్లకు పక్షవాతం వచ్చి పూర్తిగా నడవలేని స్థితిలో ఉన్న యువతికి సంకల్ప ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స చేసి సాధారణంగా నడిచే విధంగా తీర్చిదిద్దామని ఆ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అనంత్‌నాగ్ తెలిపారు. స్థానిక సంకల్ప ఆస్పత్రిలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లాకు చెందిన 23 ఏళ్ల యువతిని పూర్తిగా నడవలేనిస్థితిలో నెల కిందట కుటుంబ సభ్యులు తమ ఆస్పత్రికి తీసుకువచ్చారన్నారు. న్యూరోసర్జరీ, అనస్థీషియా వైద్యులు పరీక్షించి యువతి వెన్నెముకలో ఉన్న కణితిని గుర్తించి, అరుదైన శస్త్ర చికిత్స చేసి తొలగించారని ఆయన వివరించారు. ప్రస్తుతం యువతి పూర్తిగా కోలుకోవడం తోపాటు సాధారణ స్థితిలో నడుస్తుందని, మంగళవారం డిశ్చార్జి చేశామని ఆయన తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ నాగ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## వైసీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేద్దాం

### ● మాజీ మంత్రి పెద్దిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి(జీవకోన),అక్టోబరు8: వైసీపీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేద్దామని మాజీ మంత్రి, తిరుపతి, చిత్తూరు జిల్లాల వైసీపీ అధ్యక్షుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం తిరుపతిలోని పీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లాల సమన్వయకర్తల అంతర్గత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలు, నాయకులకు తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యేలు వెంకట గౌడ, డాక్టర్ సునీల్, సమన్వయకర్తలు రాజేష్, విజయానందరెడ్డి, కృపారాణి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు స్మార్ట్ మీటర్లపై అవగాహన అవసరం


### సీఎండీ కె.సంతోషరావు



కరపత్రాలు విడుదల చేస్తున్న సీఎండీ సంతోషరావు, అధికారులు

తిరుపతి (ఆటోనగర్), అక్టోబరు 8: విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లపై అవగాహన అవసరమని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు వెల్లడించారు. తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం స్మార్ట్ మీటర్ల గురించి ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ సంస్థ పరిధిలో వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ సర్వీసులకు ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించనున్న తరుణంలో స్మార్ట్ మీటర్ల పనితీరును వివరించాలని సూచించారు. ఈ మీటర్లు అమర్చడం వల్ల ఎలాంటి నష్టం ఉండదన్న విషయాలను వినియోగదారులకు వివరించాలని ఆయన తెలిపారు. ఇప్పటికే సంస్థ పరిధిలో వున్న ప్రభుత్వ కార్యాలయాలకు, హెచ్‌టీ సర్వీసులకు విద్యుత్ మీటర్లు అమర్చినట్లు చెప్పారు. ఈ మీటర్లు అమర్చడం వల్ల ఎంత విద్యుత్ వినియోగం జరుగుతుందనేది అప్పటికప్పుడే వినియోగదారులు తెలుసుకుని, పొదుపు చేసుకోవచ్చని సీఎండీ వెల్లడించారు. సెక్షన్ స్థాయినుంచి దీనిపై ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు లక్ష్మీనరసయ్య, అయూబ్‌ఖాన్, జీఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈలు వేణుగోపాల్ రావు, డీఈ ఈఈలు రాజేంద్ర ప్రసాద్, ఆదాని పాల్గొన్నారు.

## భూమనను కలిసిన ఎమ్మెల్సీ బొత్స



తిరుపతి (జీవకోన), అక్టోబరు 8: తిరుపతికి విచ్చేసిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మంగళవారం మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను కరుణాకర్‌రెడ్డి దుశ్శాలువాతో సత్కరించారు. బొత్సతో పాటు మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు కూడా ఉన్నారు.

## నడిరోడ్డుపై ప్రమాదకరంగా గొయ్యి



లీలామహల్ కూడలిలో డ్రైనేజి కాల్వపై ఏర్పడిన గొయ్యి

తిరుపతి(లీలామహల్), అక్టోబరు 8: నిత్యం రద్దీగా ఉండే లీలామహల్ కూడలిలో నడిరోడ్డుపై డ్రైనేజి కాల్వ మీద గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. బస్టాండు నుంచి కపిలతీర్థం, మంగళం నుంచి పాతమున్సిపల్ ఆఫీసుకు వెళ్లే రెండు మార్గాల వాహనదారులకు ఈ గొయ్యి నుంచి ప్రమాదం పొంచి ఉంది. ఈ మార్గాల్లో నిత్యం రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదం బారిన పడతారు. గొయ్యి పెద్దది కావడంతో చుట్టూ ప్లాస్టిక్ బిన్‌లు ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగకముందే ఈ గొయ్యిని పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

# మురికిగుంటలా 'తిరుప్పావై' మార్గం



తిరుప్పావైమార్గంలో నిలిచిపోయిన నీరు

తిరుపతి అర్బన్, అక్టోబరు 8: పై చిత్రాన్ని మురికి గుంట అనుకుంటే పొరపాటే.. సాక్షాత్తు తిరుప్పావై మార్గం. గత కొన్ని నెలలుగా అక్కడి స్థానికులు కంపుతో సహజీవనం చేస్తుండడం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన మాస్టర్‌ప్లాన్ రోడ్లలో భాగంగా గోవిందధామం ఎగువన పెట్రోల్‌బంకుకు ఆనుకుని దక్షిణంగా నలందస్కూల్ వరకు సిమెంట్‌రోడ్డు నిర్మించారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని అత్యుత్సాహంతో రోడ్డువేసినా సైడ్ కాలువలు ఏర్పాటు చేయకుండా, నీరు దిగువకు వెళ్లేందుకు మార్గం ఏర్పాటు చేయకుండా వదిలేశారు. దీంతో మురుగు నీరు రోడ్డు చివరకు వచ్చి నిలిచిపోతోంది. వర్షం కురిస్తే ఎగువ నుంచి వచ్చే నీటితో అక్కడ తటాకాన్ని తలపిస్తోంది. కొన్ని గంటల పాటు రాకపోకలు స్తంభిస్తున్నాయి. గత ప్రభుత్వంలో దాదాపు తొమ్మిది నెలలు ఇలానే గడిచింది. సమస్యను పరిష్కరించాలంటూ ప్రజలు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపానపోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా ఈ సమస్య తీరలేదు. నగరపాలక సంస్థ అధికారులకు స్పందనలోనూ ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇంకెన్నాళ్లు కంపులో గడపాలి, దోమల ప్రభావాన్ని భరించాలి, మురికినీటిలో నడవాలి అంటూ ప్రజలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## స్విమ్స్‌లో రేపు రాయితీతో వైద్య పరీక్షలు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 8: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్విమ్స్‌లోని బయోకెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 10న 50 శాతం రాయితీతో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వేల్ప్రోరిక్ యాసిడ్, లిథియం పరీక్షలకు ఒక్కో పరీక్షను కూడా రూ.150లకే నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాయితీతో నిర్వహించే వైద్య పరీక్షలను అవసరమైన రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఏకలవ్య పాఠశాలల్లో అధ్యాపక పోస్టులకు దరఖాస్తులాహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 8: జిల్లాలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఒజిలి, బీఎన్‌కండ్రిగ)లో ఈ విద్యా సంవత్సరంలో గెస్ట్ టీచర్లుగా సీబీఎస్‌ఈ సిలబస్ బోధించేందుకు అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ -తెలుగు2, ఫిజిక్స్ 1, బయాలజీ 1, టీజీటీ -హిందీ బోధించేందుకు 21 నుంచి 60 సంవత్సరాలు అర్హత గలవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నవోదయ, కేంద్రీయ విద్యాలయం, స్టేట్ గవర్నమెంట్ సంస్థల నుంచి పదవీ విరమణ పొందిన 60 నుంచి 65 సంవత్సరాల ఉపాధ్యాయులు ఈ నెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత కార్యాలయం, బి బ్లాక్, 5వ ఫ్లోర్, రూమ్ నెంబర్ - 504లో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 94935 24121 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.



## ఇక్కడ కాదు.. ముందుకు వెళ్లండి

తిరుమల మాడవీధుల్లోని గ్యాలరీలు నిండి గేట్లను మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకే మూసివేశారు. దీంతో భక్తులు తిరుమల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎక్కడికి వెళ్లినా 'ఇక్కడ కాదు.. ముందుకు వెళ్లండి' అంటూ భద్రతా సిబ్బంది పంపేయడంతో భక్తులు కూడా అన్ని ప్రవేశమార్గాలకు వెళ్లి మూసివేసిన గేట్లను చూడాల్సి వచ్చింది. ఎక్కడ మొదలయ్యారో తిరిగి మళ్లీ అక్కడికే చేరుకోవడం గమనార్హం. దీంతో చాలా మంది భక్తులు టీటీడీ తిరుమలలోని పలు ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లలోనే స్వామి వాహనసేవలను వీక్షించారు. మరికొంతమంది తిరిగి వెళ్లిపోయారు. గ్యాలరీల్లో దాదాపు 2 లక్షల మంది.. క్యూలైన్ల ద్వారా మరో 40 వేల మంది గరుడ సేవను తిలకించారు. పోలీసుల అంచనా ప్రకారం మరో లక్ష మంది మాడవీధుల వెలుపలే ఉండిపోవాల్సి వచ్చింది.



## ఎటుచూసినా కార్లే

గరుడసేవను వీక్షించేందుకు భక్తులు సొంత వాహనాల్లో తిరుమలకు భారీగా తరలివచ్చారు. దీంతో తిరుమల కొండపై ఎక్కడ చూసినా రోడ్లపై కార్లు బారులు తీరాయి. 28 ప్రాంతాల్లో 9 వేల వాహనాలకు సరిపడ పార్కింగ్ ప్రదేశాలను టీటీడీ ఏర్పాటు చేసింది. అంచనాకు మించి వాహనాలు రావడంతో పార్కింగ్ ప్రదేశాలు చాలక రోడ్లపైనే వాహనాలను ఆపారు. తిరుమలలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు తిరుమలకు వచ్చే వాహనాలను జీఎన్‌సీ మీదుగా రింగ్‌రోడ్డు నుంచి పార్కింగ్ ప్రదేశాలకు తరలించేలా ఏర్పాటు చేశారు. కానీ వాహనాల సంఖ్య పెరగడంతో పార్కింగ్ సరిపోక భక్తులు వారి వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేసి వదిలేశారు. దీంతో ట్రాఫిక్ సమస్య పెరిగి ఇతర వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

## మూలవిరాట్టు దర్శనానికీ..



గరుడసేవతో పాటు ఆలయంలోని మూలవిరాట్టు దర్శనానికి కూడా భక్తులు క్యూలైన్‌లో బారులు తీరాల్సి వచ్చింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లన్నీ నిండిపోవడంతో నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్లు కూడా నిండిపోయాయి. దీంతో క్యూలైన్ కృష్ణతేజ అతిథిగృహం మీదుగా శిలాతోరణం సర్కిల్ వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేరకు వ్యాపించింది. వీరికి 20 గంటల దర్శన సమయం పడుతుంది.



## గోవిందా.. అన్నప్రసాదాలు తీసుకోండి

గ్యాలరీల్లో 20 గంటలకుపైగా ఉన్న భక్తులకు టీటీడీ నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, మజ్జిగ అందజేసింది. ఉదయం 5-6 గంటల మధ్య పాలు, కాఫీ.. 6.30-8 గంటలకు ఉప్మా, పొంగలి.. 9.30-12 గంటల మధ్య సాంబారన్నం, టమాటా అన్నం, స్వీట్ పొంగల్ అందించారు. మధ్యాహ్నం 12-3 గంటల మధ్య రెండు లక్షల పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. సాయంత్రం సుండల్, కాఫీ, పాలు ఇచ్చారు. ఆ తర్వాత విజిటబుల్ కిచిడీ పంపిణీ చేశారు. ఇలా.. గ్యాలరీల్లో ఉన్న భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా టీటీడీ చర్యలు చేపట్టింది.

## పదండి ముందుకు

- బ్యాడ్జీ వీఐపీలనూ నెట్టిన సిబ్బంది

సాధారణంగా గరుడసేవ వీక్షించేందుకు వచ్చే ప్రముఖులకు పెద్ద, చిన్న బ్యాడ్జీలను జారీ చేస్తారు. ఈ బ్యాడ్జీలతో వచ్చిన వీఐపీలను వాహనప్రారంభం వరకు కుడివైపునున్న గ్యాలరీల్లో ఉంచారు. వాహనం ప్రారంభమైన వెంటనే వారిని క్యూలైన్ ద్వారా వాహనం ముందుకు అనుమతించారు. త్వరగా ముందుకు వెళ్లండి అంటూ భద్రతా సిబ్బంది వారిని కూడా నెడుతూ కనిపించారు.

– తిరుమల, ఆంధ్రజ్యోతి



# శ్రీవారికి కళారాధన























మోహిని అవతార వాహనసేవలో కళాబృందాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కిక్లి(పంజాబ్), హోజాగిరి(త్రిపుర), గర్బా(గుజరాత్) నృత్యాలు గ్యాలరీల్లోని భక్తుల దృష్టిని ఆకర్షించాయి. 14 రాష్ట్రాలకు చెందిన 490 మంది కళాకారులు ప్రదర్శనలిచ్చారు. రాత్రి గరుడ సేవలో 15 రాష్ట్రాల కళాబృందాల ప్రదర్శనలు భక్తులను మైమరపింపజేశాయి. తమ రాష్ట్ర సంప్రదాయ కళారూపాలతో కళాకారులు అలరించారు. సాయంత్రం 4.30 గంటలకు 713 మంది కళాకారులు మాడవీధుల్లోకి వచ్చి గ్యాలరీల్లోని భక్తులను తమ ప్రదర్శనలతో కట్టి పడేశారు. రాజస్థాన్ చారి రూపకం, తెలంగాణ థింసా నృత్యం, బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవం నృత్య రూపకం, శ్వేతనృత్యం ఆకట్టుకున్నాయి. తిప్పని గర్బ(గుజరాత్), భూమి(ఒడిశా), లావని గోందల్ (మహారాష్ట్ర), మయూర (కేరళ), మణిపూరి, కొరయా వంగళ (త్రిపుర), ముండరి (జార్ఖండ్), అస్సామి బిహు (అసోం), భరతనాట్యం(కర్ణాటక ), కజరీ (ఉత్తరప్రదేశ్), ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థుల కూచిపూడి(తిరుపతికి)నృత్యాలు భక్తులను ఓలలాడించాయి, భరతన్యాటం, కోలాటాలు, శ్రీనివాసకల్యాణం, డప్పు విన్యాసాలు మనసు దోచాయి.











అలిపిరి వద్ద ద్విచక్రవాహనదారులను అడ్డుకుంటున్న పోలీసులు

## కిందే పార్కింగ్ చేసుకోండి

- బస్సుల్లో వెళ్లండి
- అలిపిరి వద్ద ద్విచక్ర వాహనాల నిలిపివేత
- రెండు గంటల పాటు నాలుగు చక్రాల వాహనాలు కూడా..

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 8: తిరుమలకు మంగళవారమంతా ద్విచక్ర వాహనాలను, రెండు గంటలపాటు నాలుగు చక్రాల వాహనాలను నిలిపేశారు. తిరుపతిలోనే పార్కింగ్ చేసి బస్సుల్లో వెళ్లాలని అలిపిరి వద్ద పోలీసులు ఆపి వెనక్కి పంపేశారు.

ప్రతి సంవత్సరం లాగే గరుడోత్సవం సందర్భంగా ఘాట్‌రోడ్లలో ద్విచక్ర వాహనాలను ఆపేశారు. సోమవారం రాత్రి 9 గంటల మంగళవారం ఉదయం వరకు ఆపారు. దీంతో తిరుపతిలో కేటాయించిన పార్కింగ్ ప్రదేశాలలో ద్విచక్ర వాహనాలను నిలిపి.. బస్సుల్లో తిరుమలకు వెళ్లారు. ఇక, మంగళవారం ఊహించని రీతిలో కొండకు భక్తులు దాదాపు 6500 సొంత వాహనాల్లో వెళ్లారు. తిరుమలలో పార్కింగ్ స్థలాలకు మించి వాహనాలు వెళ్లడంతో.. సాయంత్రం 4.25 గంటల నుంచి 6.38 గంటల వరకు నాలుగు చక్రాల వాహనాలను అలిపిరి వద్దే ఆపేశారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి గరుడ సేవ తిలకించడానికి వచ్చిన భక్తులు ఇబ్బంది పడ్డారు. వీరిని ఆర్టీసీ బస్సుల ద్వారా కొండకు పంపారు. అలిపిరి వద్ద చిత్తూరు రిజర్వు అదనపు ఎస్పీ నేతృత్వంలో డీఎస్పీ వెంకటనారాయణ, సీఐలు రాంకిషోర్, రామకృష్ణ, ఎస్వీ సీఐ శ్రీనివాసులు, ఇతర పోలీసు అధికారులు బందోబస్తు చర్యలు చేపట్టారు. అలిపిరి వద్ద విజిలెన్సు సిబ్బంది కొందరు భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు విమర్శలు వచ్చాయి. తనిఖీ కేంద్రం వద్ద అవసరమైన సిబ్బంది లేకపోవడంతో వాహనాల తనిఖీ ఆలస్యమైంది. ఉదయం, మధ్యాహ్నం వాహనాలు బారులు తీరాయి. దీనిపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఇక, తనిఖీ కేంద్రంలో లగేజీలు, వాహనాల తనిఖీ బాగా ఆలస్యం కావడంతో చాలా మంది ఇబ్బంది పడ్డారు.



సాయంత్రం 4.35 గంటల నుంచి నాలుగుచక్రాల వాహనాలూ నిలిపివేత



అలిపిరి పాతచెక్‌పోస్టు వద్ద ద్విచక్ర వాహనాల పార్కింగ్

# తిరుపతి- తిరుమల మధ్య 1,86,583 మంది

- రాత్రి 12 గంటల వరకు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించిన భక్తులు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 8: గరుడోత్సవం సందర్భంగా మంగళవారం వేకువజాము నుంచి రాత్రి 12 గంటల వరకు 1,86,583 మంది భక్తులు తిరుపతి- తిరుమల మధ్య ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించారు. మొత్తం 5475 ట్రిప్పుల ద్వారా వీరిని తరలించారు. 97,402 మందిని 2764 ట్రిప్పులలో తిరుమలకు.. 89,181 మందిని 2711 ట్రిప్పులలో కొండ నుంచి తిరుపతికి బస్సుల్లో తరలించినట్లు ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. ఇక, సాయంత్రం రెండు గంటలు మినహా సొంత వాహనాల్లోనూ భక్తులు రాకపోకలు సాగించారు. పెరటాసిమాసం... దసరా సలవులు... గరుడసేవ నేపథ్యంలో తిరుమలకు తరలివచ్చిన భక్తులతో తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండ్లు కిటకిటలాడాయి. ఏడు కొండల బస్టాండులోని టికెట్ కౌంటర్ల వద్ద ప్రయాణికులు బారులుతీరారు. దాదాపు మూడు గంటల పాటు నిలబడాల్సి ఇబ్బందులుపడ్డారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ప్రతి బస్సులోనూ కండక్టర్లు ఉండడంతో పరిస్థితి చక్కబడింది. ఈ సారి కొత్తగా ఏర్పాటుచేసిన పార్కింగ్ స్థలాల నుంచి బస్సుల్లో తిరుమలకు వెళ్లడానికి భక్తుల నుంచి ఓ మోస్తరు ఆదరణ లభించగా, దేవలోక్ నుంచి మాత్రం ఎక్కువ ట్రిప్పులు తిరిగాయి. 404బస్సులు ఏర్పాటు చేసి నిమిషానికి నాలుగు బస్సులు తిరుమల-తిరుపతిల మధ్య తిరిగాయి. గరుడసేవ ప్రారంభమైన వెంటనే కొండదిగే భక్తుల సౌకర్యార్థం ముందుజాగ్రత్తగా 300బస్సులను రాంభగీచ, బాలాజీబస్టాండులలో సిద్ధంగా ఉంచారు. రాత్రి 8గంటలకు ప్రయాణీకుల తిరుగుముఖం ప్రారంభమైంది. ఇక, గరుడసేవ ముఖ్యమైన రోజు కూడా ఆర్టీసీ యూనియన్ల ప్రతినిధులు ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు, సెక్యూరిటీ, ఇతర సిబ్బందికి టీ, కాఫీ, బిస్కెట్స్ వంటి అల్పాహార వితరణ చేశారు. ఆ దృశ్యాలను ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకున్న వీరు.. ప్రయాణికులకు సేవలు అందించడానికి ముందుకు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. టిక్కెట్ల కోసం బారులు తీరిన భక్తులకు త్వరిత గతిన టిక్కెట్లు జారీ అయ్యేలా చూడకపోవడంపై విమర్శలు వచ్చాయి.




బస్సులోకి ఎక్కేందుకు పోటీ



ఏడుకొండలు బస్టాండులో టికెట్ కౌంటర్ వద్ద బారులు



ఉదయం వాహన సేవ ముందు గంట కొడుతున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి





ఎండకు రక్షణగా గొడుగులతో గ్యాలరీల్లోని భక్తులు

## జాబ్‌మేళాలో 26మంది ఎంపిక



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ప్రతినిధులు

సత్యవేడు, అక్టోబరు 8: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 26మంది ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో నిర్వహించిన మేళాలో హీరోమోటోకార్ప్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ తదితర సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 58 మంది హాజరు కాగా అందులో 26 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి, వెలుగు ఏపీఎం డాంగే యాదవ్, హీరో మోటోకార్ప్ ప్రతినిధి వినయ్ కుమార్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ జోనల్ మేనేజర్ ప్రశాంత్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య పాఠశాలల్లో అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 8: జిల్లాలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఓజిలి, బీఎన్‌కండ్రిగ)లో ఈ విద్యా సంవత్సరంలో గెస్ట్ టీచర్లుగా సీబీఎస్‌ఈ సిలబస్ బోధించేందుకు అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. పీజీటీ -తెలుగు2, ఫిజిక్స్ 1, బయాలజీ 1, టీజీటీ -హిందీ బోధించేందుకు 21 నుంచి 60 సంవత్సరాలు, అలాగే నవోదయ, కేంద్రీయ విద్యాలయం, స్టేట్ గవర్నమెంట్ సంస్థల నుంచి పదవీ విరమణ పొందిన 60 నుంచి 65 సంవత్సరాల ఉపాధ్యాయులు ఈనెల 18లోపు దరఖాస్తులను జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత కార్యాలయం, బిబ్లాక్, 5వ ఫ్లోర్, రూం నెం.504లో అందజేయాలన్నారు. వివరాలకు నెం.9493524121లో సంప్రదించాలన్నారు.

# పుత్తూరు వార్తలు

## పుత్తూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో.. మద్యం దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ

● మొత్తం 68 దరఖాస్తులు.. రూ.1.36 కోట్ల ఆదాయం

పుత్తూరు అర్బన్, అక్టోబరు 8: పుత్తూరు ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాల కోసం మంగళవారం ఒక్క రోజే ఏకంగా 37 దరఖాస్తులు దాఖలయ్యాయి. మొత్తం 68 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ మురళీ మోహన్ పేర్కొన్నారు. కాగా, పుత్తూరు ఎక్సైజ్ సర్కిల్‌లో దరఖాస్తుకు రూ.2లక్షల చొప్పున 68 దరఖాస్తులకు రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1.36 కోట్ల ఆదాయం చేకూరినట్లైంది. ఈనెల 9న బుధవారం దరఖాస్తులకు గడువు ముగియనుండటంతో మరిన్ని దాఖలయ్యే అవకాశం ఉంది. వెల్లువెత్తిన దరఖాస్తుల దాఖలాలతో పుత్తూరు పరిధిలో మద్యం దుకాణాల ఏర్పాటుకు తీవ్ర పోటీ నెలకొంది.

## పార్వతీదేవి అలంకరణలో ద్రౌపది దేవి



పార్వతీదేవిగా ద్రౌపదిదేవి, వడమాలపేట కన్యకాపరమేశ్వరి

పుత్తూరు టౌన్/ వడమాలపేట, అక్టోబరు 8: పట్టణంలోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో అమ్మవారిని పార్వతీదేవిగా అలంకరించారు. రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న నాగాలమ్మ ఆలయంలో అమ్మవారు మహాసరస్వతిగా భక్తులను కటాక్షించారు. రాచపాలెంలో ఉన్న లక్ష్మీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. వడమాలపేట పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు పార్వతీదేవిగా దర్శనమిచ్చారు. పూడి అంకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

## శాంసంగ్ కంపెనీపై చర్యలు తీసుకోండి: సీఐటీయూ

పుత్తూరు టౌన్, అక్టోబరు 8: శాంసంగ్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా జరిగింది.సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ తమిళనాడులోని కాంచీపురం జిల్లా సుంకువారి సత్రంలో ఉన్న శాంసంగ్ కంపెనీలో 1200 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం అన్యా య మన్నారు. విజయ్, వెంకటేష్, రమేష్, చిరంజీవి, శివ తదితరులు పాల్గొన్నారు.

## మామిడి దిగుబడుల కోసం ముందస్తు చర్యలు

వడమాలపేట, అక్టోబరు 8: మామిడిలో అధిక దిగుబడలు కోసం ముందస్తు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన అధికారి సౌజన్య సూచించారు. ఎస్‌వీపురం పరిధిలో పొలం పిలుస్తోందిలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పూత, పిందె దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏవో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్రో పోటీల్లో తడుకు విద్యార్థుల ప్రతిభ



జ్ఞాపికలతో విద్యార్థులు

వడమాలపేట, అక్టోబరు 8: వరల్డ్ స్పేస్ వారోత్సవాల్లో భాగంగా ఇస్రో ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన రాత పరీక్షలో తడుకు ఆర్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. సీనియర్స్ విభాగంలో రుద్రి(9వ తరగతి) మొదటి స్థానం, జూనియర్స్ విభాగంలో హేమ(8వ తరగతి) రెండో స్థానం, కార్తీక(8వ తరగతి) మూడవ స్థానంలో నిలిచారు. విజేతలను శ్రీహరి కోటకు తీసుకువెళ్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ చెప్పారు.



# శ్రీకాళహస్తి సత్యవేడు

# అనుగ్రహించు తల్లీ



లక్ష్మీ సమేత రంగనాథస్వామి అలంకారంలో బజారువీధి కన్యకాపరమేశ్వరి





రాజరాజేశ్వరిగా కనకాచలం కనకదుర్గమ్మ - లలిత త్రిపుర సుందరిగా బీపీ అగ్రహారం చిన్న గంగమ్మ - ప్రత్యేక అలంకారంలో బహదూరుపేట కరుమారియమ్మ - మహాలక్ష్మి అలంకారంలో పొన్నాలమ్మ - లక్ష్మీదేవిగా వేడాం దక్షిణ కాళికాదేవి - బొమ్మలకొలువులో కాత్యాయనిదేవిగా అమ్మవారు - రాజరాజేశ్వరిగా కనకాచలం కనకదుర్గమ్మ

శ్రీకాళహస్తి, అక్టోబరు 8: అనుగ్రహించు తల్లీ అంటూ భక్తులు అమ్మవార్లకు ప్రణమిల్లారు. శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు అమ్మవార్లు వివిధ రూపాల్లో కొలువై భక్తులపై వరాల జల్లు కురిపించారు. భక్తులు ఎంతో శ్రద్ధతో ఉదయంనుంచే ఆలయాలకు వెళ్లి దీపారాధన చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబిక ఉత్సవమూర్తిని వ్యాఘ్రాసుర వధ అలంకారంలో కొలువు దీర్చారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేకంగా ధూపదీప నైవేద్యాలు సమర్పించి ఆలయంలో రంగులగోపురం వరకు ఊరేగించారు. అలాగే ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఉత్సవమూర్తి కాత్యాయనిగా దర్శనమిచ్చారు. ఇదే ఆలయంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ మహాలక్ష్మిదేవి అలంకా రంలో భక్తులను కటాక్షించారు. ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవమూర్తిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు. వేడాంలో కొలువై ఉన్న దక్షిణకాళికాదేవి లక్ష్మీ దేవిగా, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి దేవి ఉత్సవ మూర్తి లక్ష్మీసమేత రంగనాథస్వామి అలంకారంలో దర్శనమిచ్చారు. పొనగల్ గంగమ్మ ప్రత్యేక అలంకారంలో కొలువు దీరారు. భాస్కరపేటలో కొలువై ఉన్న చాముండేశ్వరి స్కందమాతగా, ముత్యాలమ్మ గుడి వీధిలోని ముత్యాలమ్మ గాజుల అలంకారంలో, పొన్నాలమ్మ, బీపీఅగ్రహారం పెద్దగంగమ్మ మహాలక్ష్మిదేవి అలంకారంలో, బహదూరుపేటలోని కన్యకాపరమేశ్వరి తెట్టులోని నల్లగంగమ్మ, విశ్వ బ్రాహ్మణ వీధిలోని గంగమ్మ, ముత్యాలమ్మ గుడి వీధిలోని నింబజాదేవి, అష్టలక్ష్మి, ఏడుగంగల అమ్మవారు, పూసల వీధి గంగమ్మ, శీతాలాంబ, త్రిశూలాంబ, సంతమైదానం అంకాళమ్మ, పీవీరోడ్డులోని అంకమ్మ అమ్మవార్లు విశేషాలంకారంలో భక్తులను కటాక్షించారు.

# వేడుకగా శరన్నవరాత్రి ఉత్సవాలు



కరుమారియమ్మగా అవనాక్షమ్మ - మహాలక్ష్మిగా చిందేపల్లి పార్వతిదేవి - మహాలక్ష్మి అవతారంలో కామాక్షమ్మ, సర్వమంగళాదేవి

నారాయణవనం, అక్టోబరు 8: మండలంలోని సముదాయంలో కొలువై ఉన్న టీటీడీ అనుబంధ ఆలయమైన అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారిని సాయంత్రం 6.30 గంటలకు కరుమారియమ్మగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలో తిరుచ్చి వాహనంపై ఊరేగించారు. కైలాస నాథ కోనలో కొలువై ఉన్న కామాక్షి దేవి కంచి కామాక్షిగా దర్శన మిచ్చారు.

**వరదయ్యపాళెం:** మండలంలోని అంబూరులో కొలువై ఉన్న కామాక్షమ్మ దేవి మహాలక్ష్మిగా భక్తులను కటాక్షించారు. అమ్మవారిని రూ.2.5 లక్షలతో అలంకరించారు. ఆణిముత్యం నంద కిషోర్‌రెడ్డి తీర్థప్రసాదాలు అందజేశారు.

**ఏర్పేడు:** మండలంలోని కందాడులో కొలువై ఉన్న కామాక్షి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో పిండి అలంకరణతో అమ్మవారు దేదీప్యమానంగా కనిపించారు. ఆలయ ప్రాంగణంలో లలిత సహస్రనామాలతో కుంకుమార్చన జరిగాయి. చిందేపల్లి సిద్ధేశ్వరస్వామి ఆలయంలో పార్వతిదేవి మహాలక్ష్మిగా, గుడిమల్లం పరశురామేశ్వర ఆలయంలో వల్లీ దేవసేన మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు.

**సత్యవేడు:** పట్టణంలోని కల్యాణ వీరభద్ర స్వామి ఆలయంలో శరన్నవరాత్రులను పురస్కరించుకుని సర్వమంగళాదేవి లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం సాయంత్రం అమ్మవారిని వివిధ పుష్పాలతో పాటు రూ.30 లక్షలతో అలంకరించారు.

## శాప్‌లో విప్లవాత్మక మార్పులు

● క్రీడారంగంలో పీపీపీ విధానంపై ప్రత్యేక దృష్టి
● చైర్మన్ రవినాయుడు



కలెక్టర్‌ను సత్కరిస్తున్న రవినాయుడు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 8: క్రీడారంగంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వస్తుందని శాప్ చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌ను జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్‌తో కలిసి రవి నాయుడు కలెక్టరేట్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. రాష్ట్రప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగా మంత్రి లోకేశ్ పీపీపీ విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. తిరుపతి, విజయవాడ, కాకినాడ, విశాఖపట్టణంలలో క్రీడారంగాన్ని అభివృద్ధి చేయడమే శాప్ లక్ష్యమని చెప్పారు. ఖేలో ఇండియా నిధులతో ఒలంపిక్స్ వంటి అంతర్జాతీయ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు పాల్గొనేలా కృషి చేయాలనేది సీఎం చంద్రబాబు సంకల్పమన్నారు. జిల్లాలో శాప్‌కు 38 ఎకరాల అవసరముందని, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేసేందుకు స్మార్ట్‌సిటీ నిధులను కేటాయించాలని కోరారు. 2014-19లో టీడీపీ ప్రభుత్వం తిరుపతి స్పోర్ట్స్ విలేజీకి 145 ఎకరాలు కేటాయిస్తే, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ భూమిని లేఅవుట్‌గా మార్చి అమ్మేసిందన్నారు. తిరుపతిలో స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వం క్రీడాకారులకు ఇచ్చిన భూములు నిరుపయోగంగా ఉన్నాయని, అకాడమీల ఏర్పాటుకు చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కలెక్టర్‌ను కోరారు.

**మోడల్ సెంటర్లను ఎంపిక చేయండి**

సానుకూలంగా స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ యువతను క్రీడలవైపు ప్రోత్సహించేందుకు శాప్ చైర్మన్ పదవి దోహదపడుతుందని రవి నాయుడును అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా మోడల్ సెంటర్లను తీర్చిదిద్దాలని సూచించారు. క్రీడారంగానికి సమకూర్చాల్సిన నిధుల విషయంలో పూర్తి సహకారమందిస్తామన్నారు. కార్యక్రమంలో తిరుపతి టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్‌యాదవ్, తెలుగు యువత అధికార ప్రతినిధి తోట వాసు, తెలుగు యువత రాష్ట్ర నాయకులు రంజిత్ నాయుడు, శ్రీరాంబాబీ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కరించండి: సీఐటీయూ

కేవీబీపురం, అక్టోబరు 8: మండలంలో భూ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ డిమాండ్ చేస్తోంది. ముఖ్యంగా అగ్రవర్ణాల వారు దళిత, గిరిజనుల భూములను కబ్జా చేస్తున్నారన్నారు. వగత్తూరులో శ్మశాన భూమి, సర్వే నెం.59లో కృష్ణుడి గుడికి చెందిన భూమి, కాట్రపల్లి సర్వే నెం.213లో భూమి, రాజులకండ్రిగ, దిగువ పుత్తూరు, కాళంగిల్లో భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## గంగమ్మ ఆలయంలో మరుపొంగళ్లు

రేణిగుంట, అక్టోబరు 8: పట్టణంలోని గంగమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి మరు పొంగళ్లు భక్తిశ్రద్ధలతో సమర్పించుకున్నారు. దసరా నవరాత్రుల్లో భాగంగా మంగళవారం అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

## ద్విచక్ర వాహనాల ఢీ

● ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం

రేణిగుంట, అక్టోబరు 8: ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. రేణిగుంట అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు... మామండూరు- కుక్కలదొడ్డి మార్గమధ్యంలో కోడూరు నుంచి ద్విచక్ర వాహనంలో బాలరాజు(55) తిరుపతికి వస్తుండగా తిరుపతి నుంచి కోడూరుకు ద్విచక్ర వాహనంలో వెళుతున్న నరసింహులు ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇద్దరు తీవ్రంగా గాయపడగా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి బాలరాజు మృతి చెందగా నరసింహులు పరిస్థితి విషమంగా ఉంది.

## కలెక్టర్‌తో టీడీపీ నాయకుల భేటీ



శ్రీకాళహస్తి, అక్టోబరు 8: తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మంగళవారం టీడీపీ శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై చర్చించారు. టీడీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్ తదితరులున్నారు.

## 227 మద్యం దుకాణాలకు 1520 దరఖాస్తులు

● నేటితో ముగియనున్న గడువు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 8: జిల్లాలో 227 మద్యం దుకాణాలకు అనుకున్న స్థాయిలో టెండర్లు దాఖలు కావడంలేదు. ఎనిమిది రోజుల వ్యవధిలో 1520 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఒక్కో దుకాణానికి 15 నుంచి 20 దరఖాస్తులు వస్తాయని అధికారులు భావించారు. కానీ ఇప్పటికి వచ్చింది సగటున ఆరు నుంచి ఏడు దరఖాస్తులు మాత్రమే. ఇక, బుధవారం సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే గడువు ఉంది. ఈ ఒక్క రోజు ఎన్ని దరఖాస్తులు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది.

## 14నుంచి పల్లెపండుగను ఘనంగా నిర్వహించండి

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 8: పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో ఘనంగా నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి ఆయన జిల్లా అధికారులతో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ వర్చువల్ విధానంలో మాట్లాడుతూ జిల్లాలో జరిగే పల్లె పండుగ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, సర్పంచులు ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వాములుగా చేయాలన్నారు. ఆగస్టు నెలలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలను నిర్వహించి, ప్రతి పనికి అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. వాటిని అధికారులు ప్రారంభించాలన్నారు. వచ్చే సంక్రాంతిలోగా అన్ని అభివృద్ధి పనులు పూర్తికావాలని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. పలు పంచాయతీల్లో అభివృద్ధి పనులకు రూ.74కోట్లు మంజూరు చేశారని, ఇంకా రూ.25కోట్లు మంజూరు చేయాలని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 8: మండలంలోని కనమనంబేడు ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థులు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులో జరిగిన రాష్ట్రస్థాయిలో వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనపరచారు. దీంతో ప్రిన్సిపాల్ ధర్మేంద్రసింగ్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం

శ్రీకాళహస్తి, అక్టోబరు 8: గర్భిణులు, బాలింతలు రక్తహీనత లోపంతో మరణించకూడదని తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలోని గజేంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహార్నాన్ని సద్వినియోగం చేసుకోవలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాగణాంకాల అధికారి నాగేంద్రకుమార్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి స్రవంతి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వంటమాస్టర్ హత్య కేసులో వీడిన చిక్కుముడి

● ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

ఏర్పేడు, అక్టోబరు 8: మండలంలోని రావిళ్ల వారికండ్రిగ పంచాయతీ ఎరుకలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలో నాలుగు రోజుల క్రితం వంట మాస్టర్ ప్రవీణ్(35) హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఏర్పేడు సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో రెండురోజుల క్రితం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం మంగళవారం ఏర్పేడు పోలీస్ స్టేషన్ ఆవరణలో డీఎస్పీ శ్రీనివాస్ నిందితుల అరెస్టు చూపారు. ఈ సందర్భంగా మీడియాకు వివరాలు వెల్లడించారు. రేణిగుంట మండలం అత్తూరు పంచాయతీ మొలగమూడి దళితవాడకు చెందిన ప్రవీణ్, అదే దళితవాడకు చెందిన దినేష్, కుర్రకాలువకు చెందిన లోకేష్ మిత్రులు. ఈ క్రమంలో మద్యం తాగినప్పుడల్లా దినేష్‌ను ప్రవీణ్ నానామాటలు అనేవాడు. దీంతో మనస్థాపానికి గురైన దినేష్.. ప్రవీణ్‌ను ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయాన్ని లోకేష్‌తో చెప్పాడు. పథకం ప్రకారం దినేష్, లోకేష్ ఈనెల 4న ప్రవీణ్‌కు ఫోన్ చేసి పాపానాయుడుపేటలో రావాలని కోరారు. ఈ మేరకు ప్రవీణ్ ద్విచక్రవాహనంపై చేరుకున్నాడు. ముగ్గురు కలిసి మద్యం కొనుగోలు చేసి ఎరుక లింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో మామిడి తోటకు వెళ్లారు. అక్కడ పూటుగా మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న ప్రవీణ్‌ను మచ్చుకత్తితో అతిదారుణంగా హత్య చేశారు. ప్రవీణ్ ద్విచక్ర వాహనంలో బయలు దేరి బైక్‌ను కుర్రకాలువ సమీపంలో ముళ్లపొదలో ద్విచక్ర వాహనాన్ని, మచ్చుకత్తిని, మొబైల్‌ఫోన్లను పడేసి వెళ్లిపోయారు. ప్రవీణ్ భార్య వెన్నెల కీర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ఈ నెల 5న సాయంత్రం కుర్రకాలువ సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారి నేరాన్ని అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో నిందితులను పట్టుకున్న సీఐ జయచంద్ర, సిబ్బందిని అభినందించారు.

## తాగునీటి సమస్య పరిష్కరించండి: సీపీఎం

పిచ్చాటూరు, అక్టోబరు 8: మండలంలోని కారూరులో 15 రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదని సమస్యని వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దాసరి జనార్దన్ కోరారు. పిచ్చాటూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నీరు లేక గ్రామస్తులు అల్లాడుతున్నా పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ పట్టించుకోకపోవడం సరికాదన్నారు. సీపీఎం మండల కార్యదర్శి రామచంద్రారెడ్డి, రమేష్, మురుగన్, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.